# పిరికివాడు

శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య

పగలు పదిగంటలు దాటి వుంటుంది. ఆకాశంలో శ్రావణమేఘాలు బరువుగా కదులుతున్నాయి. చల్లని గాలి వీస్తున్నది. వర్షం వచ్చే సూచన లుండడం వల్ల వీధుల్లో జనం త్వరత్వరగా నడిచిపోతున్నారు.

సత్యనారాయణ చేతిలో సంచితో నెమ్మదిగా నడుస్తున్నాడు. వీధిమలుపులో తన కెదురుపడిన సన్నటి వ్యక్తిని ఆపి "గవర్నమెంటుఆసుపత్రి ఇంకెంత దూరం వుంటుంది?" అని ప్రశ్నించాడు. ఆ వ్యక్తి చేతిలో గొడుగు విలాసంగా వూపుతూ "ఇలా మరో ఫర్లాంగు దూరం నడిస్తే పెద్ద ప్రహరీగోడ కనిపిస్తుంది. అక్కడ బోర్డు కూడా ఉంటుంది." అని చెప్పి వెళ్ళిపోయాడు.

సత్యనారాయణకు విసుగు పుట్టింది. ఇప్పటికి రైలుస్టేషనునుంచి దాదాపు మైలుదూరం నడిచి వచ్చాడు. ఇంకా ఫర్లాంగుదూరం ఉందిట! అతడు కుడిచేతిలో సంచిని ఎడమచేతిలోకి మార్చుకుని మళ్లీ నీరసంగా నడవటం ప్రారంభించాడు.

ఆవ్యక్తి చెప్పినవిధంగా, కొండరాళ్లతో ఎత్తుగా కట్టబడిన ప్రహరీగోడ కనుపించింది. మరి కాస్సేపట్లో "గవర్నమెంట్ ఆసుపత్రి" అని బోర్డు కూడా కనుపించింది. సత్యనారాయణ మెట్లెక్కుతూ వుండగా సన్నటి జల్లు ప్రారంభమైంది.

వరండాలో బల్లలమీద చాలామంది కూర్చుని వున్నారు. వాళ్లుకాక డాక్టరుగారి గదిముందు పెద్ద 'క్యూ' వుంది. సత్యనారాయణ ఒక బల్లమీద చోటు చూసుకుని కూర్చుని సంచిని క్రింద వుంచి చుట్టూ చూశాడు. ఆ బల్లమీద చివరగా ఒక నలభై ఏళ్ళ వ్యక్తి కూర్చుని అప్పుడప్పుడు దగ్గుతున్నాడు. ఎదురుగా ఒకతను గోడకు తలానించి కళ్ళు మూసుకుని కూర్చుని ఉన్నాడు. ఆ పక్కనే ఒంటినిండా గళ్ళదుప్పటి నొకదాన్ని కప్పుకుని కూర్చుని ఒకడు వణుకుతూ మూలుగుతున్నాడు. చీపురుపుల్లలా వున్న ఒక పసిపిల్లవాణ్ణి ఎత్తుకుని ఒకామె స్తంభం పక్కగా నిలబడి వుంది. వరండాక్రింద ఖాళీస్థలంలో ఎవరో వాంతి చేసుకుంటున్నారు. బల్లమీద సత్యనారాయణ పక్కగా వున్న ఖాళీ స్థలంలో ఒక వ్యక్తి వచ్చి కూర్చున్నాడు. అతని కాలి మడిమ బహుశా విరిగిందేమో! కట్టు కట్టుకుని వున్నాడు. స్తంభం పక్కన కూర్చుని, ఎర్రని ధోవతి కట్టుకునివున్న వ్యక్తి చుట్ట ముట్టించి అప్పుడప్పుడు కింద మట్టిమీద ఉమ్మేస్తున్నాడు. దాదాపు అందరిచేతుల్లోనూ సీసాలున్నాయి.

వర్షం పూర్తిగా తగ్గలేదు. సన్నటిజల్లు పడుతూనే వుంది. వీధిలో ఒక రిక్షా ఆగింది. అందులోనుంచి ఇద్దరు మనుషులు క్రిందికి దిగి మరొకణ్ణి చెరొకవైపూ పట్టుకుని దింపారు. అతనికి నోట్లోనుంచి నెత్తురు వస్తున్నది. వెనకనే ఏడుపులు వినిపించాయి. ఇద్దరాడవాళ్లు ఏడుస్తూ లోపలికి పరుగెత్తుకుని వచ్చారు. ఈ హడావిడికి డాక్టరు త్వరత్వరగా బయటికి వచ్చాడు. ఆ వ్యక్తిని లోపలికి తీసుకురమ్మని మిగిలినవాళ్ల నందర్నీ దూరంగా పొమ్మన్నాడు. ఏడుస్తున్నవాళ్లను కసిరి వూరుకోబెట్టి "ఏం జరిగింది?" అని ప్రశ్నించాడు. వాళ్లు ఏడుస్తూనే వాణ్ణి ఎవరో కొట్టారనీ, వాడి తప్పేమీ లేదని చెబుతూ ఆ కొట్టినవాళ్లను శాపనార్థాలు పెడుతున్నారు. సత్యనారాయణపక్కన కూర్చునివున్న కుంటికాలువాడు విసుగుతో, "వీళ్ళకింకేం పని వుంది? కుత్తుకదాకా తాగటం, కొట్టుకుని చావటం." అన్నాడు.

సత్యనారాయణ కళ్ళు గట్టిగా మూసుకుని బరువుగా నిట్టూర్చాడు. అతనికి నెత్తురు చూస్తే కళ్లు చెదిరినట్టుగా ఉంది. డాక్టరు మళ్ళీ తన గదిలోకి వచ్చాడు. ఇప్పటికి 'క్యూ' కొద్దిగా తగ్గి వెసులుబాటయింది. గళ్లదుప్పటి కప్పుకుని వున్న ముసలివాడూ, అప్పటిదాకా ఒక మూల కూర్చుని దగ్గుతున్నవాడూ, వాంతి చేసుకున్నవాడూ అందరూ వెళ్లి మందులు తీసుకుని తమ దారిన తాము వెళ్లిపోయారు. పసిపిల్లవాణ్ణి ఎత్తుకుని అందాకా నిలుచుని వున్న యువతి చెమర్చిన కళ్లతో చేతిలో మందుసీసాతో డాక్టరు గదిలోనుంచి బయటికి వచ్చింది. తర్వాత కుంటికాలువాడు లేచి చేతిలోవున్న బీడీ ముక్క అవతల పారేసి డాక్టరుగదిలోకి వెళ్లాడు.

వర్షం పూర్తిగా వెలిసింది. వరండాలో బల్లలన్నీ ఖాళీ అయినాయి. ఒకరిద్దరు మనుషులు ఏదో పనిమీద అటూ ఇటూ తిరుగుతున్నారు. సత్యనారాయణ కరణం వ్రాసియిచ్చిన ఉత్తరాన్ని సంచిలో నుంచి తీసి జేబులో పెట్టుకున్నాడు. ఈ డాక్టరుగారు తమవూరి కరణంగారికి దూరపు బంధువు. ఆయన, సత్యనారాయణ అట్టే కష్టపడ నవసరంలేకుండా డాక్టరు గారిపేర ఒక ఉత్తరం వ్రాసి యిచ్చాడు.

డాక్టరుగదిలోనుంచి కుంటివాడు బయటికి వచ్చాడు. సత్యనారాయణ లేచి సంచి బల్లమీదనే వుంచి డాక్టరుగదిలోకి వెళ్లి ఆయనకు నమస్కారం చేశాడు. ఆయన తలెత్తకుండా "ఏమిటి ?" అని అడిగాడు. సత్యనారాయణ జేబులోనుంచి ఉత్తరం తీసి ఆయన బల్లమీద పెట్టి "మా వూరి కరణంగారు మీకీ ఉత్తరం యిమ్మన్నారండి" అన్నాడు. డాక్టరు నొసలు చిట్లించి ఆ ఉత్తరం చేతులోకి తీసుకుని "వెనకటికి నీలాటి వాడెవరో 'మావూరికి టిక్కట్టిమ్మ'న్నాడట. మావూరి కరణంగా రంటున్నావు; ఏవూరు మీది?" అని ప్రశ్నించాడు. సత్యనారాయణ చెప్పిన జవాబు విని ఏదో గుర్తుకు వచ్చినట్టు "ఓహో!" అనుకుని జాబు విప్పి చదువుకున్నాడు.

సత్యనారాయణ రెండు నిముషాలు అలాగే నిలబడ్డాడు. ఆయన జాబు చదివి తల పైకెత్తి కళ్ళద్దాలు సర్దుకుని "నీకు కడుపునొప్పి ఎప్పటినుంచి ఉంది?" అని ప్రశ్నించాడు. సత్యనారాయణ "అయిదారు నెల్లనుంచి వున్నదండీ! మొదట అప్పుడప్పుడు వచ్చేది. మావూరి ఆచార్యుల దగ్గర మందు తింటే కొన్నాళ్లు తగ్గింది. తర్వాత మందు వాడలేదు. మళ్లీ నెలకు ప్రారంభమైంది. రానురాను మరీ ఎక్కువై రోజూ రెండు మూడు గంటలసేపు విలవిల తన్నుకునేవాణ్ణి. ఆ నొప్పి వచ్చినప్పుడు ప్రాణాలుపోతే బాగుండుననిపించేది. ఈ వారం పది రోజులనుంచి రోజూ రాత్రి పూట నొప్పి వస్తున్నది." అన్నాడు.

డాక్టరు ఒకటి రెండు నిముషా లతన్ని పరీక్షచేసి "నువ్విక్కడే ఒక నెల రోజులపాటు వుండి ట్రీట్‌మెంటు తీసుకోవాలి. అందుకు సిద్ధమై వచ్చే వుంటావు. ఈచీటీ తీసుకుపోయి ఆ గదిలో చూపించు." అని ఒక చీటీ వ్రాసి యిచ్చి, పోబోతున్న అతన్ని వెనక్కు పిలిచి "ఈపూట ఏమైనా పళ్లుమాత్రం తెప్పించుకు తిను. సాయంకాలం మందు యిస్తాను." అన్నాడు. సత్యనారాయణ తల వూపి వరండాలోకి వచ్చి సంచి తీసుకుని ఎదురుగా వున్న ఆఫీసు గదిలోకి వెళ్ళాడు.

తర్వాత ఒక పావుగంటలో అతని పని పూర్తి అయింది. ఒక జవాను అతన్ని తన వెంట తీసుకుపోయి అతని పడక చూపించాడు. ఆగదిలో రెండు మంచాలు వున్నాయి. రెండో మంచంమీద ఎవరో వ్యక్తి గోడవైపు తిరిగి పడుకుని నిద్రపోతున్నాడు. గది శుభ్రంగా వుంది. జవాను "నేను వెళుతున్నాను బాబూ! మీకేమైనా కావాలా?" అని అడిగాడు. సత్యనారాయణ అతన్ని ఆపి జేబులోనుంచి అర్ధరూపాయిబిళ్ళ తీసి యిచ్చి "బత్తాయిపళ్ళు తెచ్చిపెట్టు." అన్నాడు. జవాను వెళ్ళిపోయాడు.

సత్యనారాయణ సంచిని కిటికీలోవుంచి పక్కమీద కూర్చున్నాడు. ఇనుప మంచంమీద పరిచివున్న పరుపూ దిండ్లూ మెత్తగా వున్నాయి. పక్కమీద తెల్లని దుప్పటి పరిచివుంది. కిటికీలోనుంచి కనిపిస్తున్న ఆకాశ భాగంలో మబ్బులు నల్లగా కదులుతున్నాయి. కిటికీఅవతల వున్న గంగరావిచెట్టుమీద ఏదో పిట్ట కూర్చుని అరుస్తున్నది. చెట్టుక్రింద చిన్నపిల్ల లిద్దరు గోలీ లాడుకుంటున్నారు. అందమైన సీతాకోక చిలుక ఒకటి అటూ యిటూ ఎగురుతున్నది.

జవాను బత్తాయిపళ్ళు తెచ్చి యిచ్చి "అణా మిగిలిందండీ" అన్నాడు. సత్యనారాయణ పళ్ళు తీసుకుని, "ఆ అణా నువ్వుంచుకో" అనగానే వాడు ముసిముసి నవ్వులు నవ్వుతూ వెళ్లిపోయాడు. సత్యనారాయణ బత్తాయిపండు ఒలిచి ఒక్కొక్క తొన తింటూ కూర్చున్నాడు. అవతల మరో మంచంమీద పడుకుని వున్న వ్యక్తి యింతవరకూ కదలనైనా లేదు. గంగరావిచెట్టుమీద కూర్చునివున్న పిట్ట ఇంకా అరుస్తూనే వుంది. అంతవరకూ ఆ చెట్టుక్రింద కూర్చుని గోలీ లాడుతున్న పిల్లలు వెళ్లిపోయారు.

సత్యనారాయణ ఆలోచిస్తున్నాడు. ఈ పక్కమీద యింతకుముందు ఎందరు జబ్బులతో తీసుకుంటూ పడుకున్నారో! ఈ పక్కమీద పడుకుని కిటికీలోనుంచి ఆకాశంలోకి చూస్తూ ఏ ఆలోచనలు చేసేవారో! ఎంతమంది మరణయాతన పడుతూ ఈ మంచంమీద ఆఖరిక్షణాలు గడిపారో! ఎంతమంది భార్యలను పిల్లలను దిక్కులేనివాళ్ళను చేసి యీ మంచంమీద ప్రాణాలు విడిచిపెట్టారో!

సత్యనారాయణ మనసు యీ ఆలోచనలతో వికలమైపోయింది. 'ఛీ! ఇంక ఆలోచించకూడదు.' అనుకుని కిటికీవైపు తిరిగి ఆ వైపు నడిచిపోతున్న ఒక నర్సును చూశాడు. ఆమెకు ఇరవై అయిదేళ్ళు వుంటాయి. ఎత్తు మడమలజోళ్లు తొడుక్కుని నెమ్మదిగా నడుస్తోంది. సత్యనారాయణకు భార్య గుర్తుకు వచ్చింది. ఇంటిదగ్గర పిల్లవాడితో ఎంత యిబ్బంది పడుతున్నదో!

వాకిలిదగ్గర చప్పుడయింది. సత్యనారాయణ వెనక్కు తిరిగి చూశాడు. నల్లచారల పరికిణీ కట్టుకుని వున్న పదేళ్ళపిల్ల చేతిలో టిఫిన్ క్యారియర్‌తో లోపలికి వస్తున్నది. ఆ పిల్ల వెనుకనే అయిదేళ్ళ పిల్లవాడు జారిపోతున్న లాగూను పైకి లాక్కుంటూ చేతిలో బొమ్మతో లోపలికి వచ్చాడు.

ఆ పిల్ల సత్యనారాయణ వంక ఒకసారి చూసి తిరువాత అవతలి మంచం దగ్గరికి వెళ్లి ఆ వ్యక్తిని తట్టి 'నాన్నా' అని పిలిచింది. ఆ వ్యక్తి లేచి ఆవులించి చిటిక వేసి; "నువ్వా అమ్మా! ఎంతసేపయింది వచ్చి?" అన్నాడు. ఆ పిల్ల క్యారియర్ క్రిందపెడుతూ "ఇప్పుడే" అన్నది. అతడు లేచి సత్యనారాయణవంక ఒకసారి చూసి మళ్ళీ బయటికి వెళ్ళి కాళ్లు కడుక్కుని వచ్చి క్యారియర్ ముందు కూర్చున్నాడు. ఆ పిల్ల ఏదో మాట్లాడుతూ క్యారియర్ విప్పి గిన్నెలు క్రిందపెడుతున్నది.

అతనికి నలభై ఏళ్లుంటాయి. జుట్టు కొద్దిగా తెల్లబడుతున్నది. శరీరం దృఢంగాఉంది. గడ్డం పెరిగి వుంది. కళ్లు కొద్దిగా ఎర్రగా వున్నాయి అతడు సత్యనారాయణవంక చూసి "మీ దే వూరు?" అని ప్రశ్నించాడు. సత్యనారాయణ సమాధానం చెప్పి మళ్లీ కిటికీ వైపు తిరిగాడు. తర్వాత పదినిముషాలసేపు ఆ పిల్ల అప్పుడప్పుడు నెమ్మదిగా మాట్లాడటమూ, ఆ పిల్లవాడు ఆడుకుంటున్న సవ్వడి వినిపించింది. ఆ వ్యక్తి చేతులు కడుక్కునివచ్చి సత్యనారాయణ కెదురుగా కూర్చుని "మీరు వచ్చి ఎంతసేపయింది?" అని అడిగాడు. సత్యనారాయణ "ఇంతకు ముందే" అని సమాధానం చెప్పాడు.

అంతవరకూ బొమ్మ చేతితో పట్టుకుని అటూ యిటూ తిరుగుతున్న ఆ పిల్లవాడి దృష్టిఅంతా సంచిలో వున్న బత్తాయిపళ్ళమీదనే వుంది. సత్యనారాయణ వాడివంక చూశాడు. వాడి కళ్లు చక్రాలవలె వున్నాయి. అతనికి వాణ్ణి చూస్తూవుంటే ముచ్చటైంది. సంచిలో నుంచి ఒక బత్తాయిపండు తీసి వాడి కిచ్చాడు. వాడు తన చిన్న చేతుల్లో బొమ్మనూ బత్తాయిపండునూ రెంటినీ పట్టుకోలేక మట్టిబొమ్మను కింద పడేశాడు. అది ముక్కలు ముక్క లయింది. ఆ వ్యక్తి లేచి "గాడిదా! బొమ్మ కాస్తా పగలకొట్టేశావూ?" అంటూ ఆ ముక్కలు ఏరి కిటికీలోనుంచి అవతల పారేశాడు.

ఇంతలో ఆ పిల్ల క్యారియర్ కడుక్కునివచ్చి "మేము వెళుతున్నాం." అని తండ్రికి చెప్పి పిల్లవాడి చెయ్యి పట్టుకుని వెళ్లిపోయింది. తర్వాత ఒక్కక్షణం ఆగి ఆ వ్యక్తి "మీకు జబ్బేమిటి?" అని అడిగాడు. సత్యనారాయణ సంచిలోనుంచి ఉత్తరీయం పైకి తీస్తూ "కడుపులో నొప్పి" అని చెప్పాడు. ఆ వ్యక్తి వెనక్కు ఆనుకుని కూర్చుంటూ "నేను రెండు నెలల నుంచి యిక్కడ వున్నాను. నాకు మొదట మామూలుగా జ్వరం వచ్చింది. క్రమంగా టైఫాయిడ్‌లోకి దింపింది. తర్వాత డబుల్ టైఫాయిడ్ అన్నారు. ఇప్పటికి నయమయింది. నాలుగైదురోజుల్లో యింటికి వెళ్ళవచ్చని చెప్పారు డాక్టరుగారు." అన్నాడు.

తర్వాత కాస్సేపు యిద్దరూ ఏవో విషయాల మీద సంభాషణ సాగించారు. సత్యనారాయణ సహజంగా భీరువుకావడంవల్ల మాట్లాడటంకన్న వినటం జాస్తిగా సాగిస్తున్నాడు. మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటివుంటుంది. సత్యనారాయణకు నిద్రపట్టింది.

అతనికి మెలకువ వచ్చేసరికి ఆ వ్యక్తి కూర్చుని వుండి ఏదో ఆలోచిస్తున్నాడు. నర్సు వచ్చి టెంపరేచరు చూసిపోయింది. చుట్టుపక్కల అంతా నిశ్శబ్దంగా వుంది. ఆ వ్యక్తి హఠాత్తుగా నవ్వాడు. అతను కిటికీలోనుంచి తా నింతకుముందు పారేసిన బొమ్మ ముక్కలవంక చూస్తున్నాడు. కాస్సేపాగి తలవూపి గంభీరంగా "ఇదొక మట్టిబొమ్మ కొద్దిగా అటూయిటూ అయితే చాలు ముక్కలై పోతుంది." అన్నాడు. సత్యనారాయణ నివ్వెరపోయాడు.

ఆ వ్యక్తి మళ్లీ "నేను మొండివాణ్ణి. చావు నా దగ్గరికి వచ్చి కూడా నన్నేమీ చెయ్యలేక భయపడి పారిపోయింది. మీరు నమ్మరేమోగాని మృత్యుదేవత యీ గదిలోకి నే నున్న రెండు నెలలలోనూ రెండు సార్లు వచ్చింది. రెండుసార్లూ నాకంటె చిన్నవాళ్ళను తన్నుకుపోయింది. కాని నా జోలికి రాలేక పోయింది." అన్నాడు.

సత్యనారాయణ కేమీ అర్థం కాలేదు. ఆ వ్యక్తి ముఖంలోకి నివ్వెరపోతూ చూశాడు. ఆవ్యక్తి మళ్ళీ "మీ కర్థం కాలేదా? నేను ఇక్కడ చేరినప్పుడు మీరు పడుకునివున్న మంచంమీద ఒక పేషెంటు వుండేవాడు. అతనికి పాతికేళ్లు వుంటాయనుకుంటాను. అతనికి గుండె జబ్బు వుందిట. రెండురోజులకొకసారి 'ఎక్స్‌రే ఫొటో' తీసేవారు. రోజురోజుకూ అతనిస్థితి దిగజారిపోవటమే గాని ఏమీ బాగుపడలేదు. పాలిపోయి సన్నగా వుండేవాడు. అతనెప్పుడూ నెమ్మదిగా బాధగా గాలి పీలుస్తూ పైకి చూస్తూ వుండేవాడు ఒక్కమాట మాట్లాడితే పదినిముషాలసేపు ఆయాసం వచ్చేది. అతని భార్య చిన్నది. ఇరవై ఏళ్లు వుంటాయేమో! ఎప్పుడూ మంచం పక్కనే చాపమీద కూర్చుని ఆ గంగరావిచెట్టువంక చూస్తూవుండేది. వారికి కావలసినవారెవ్వరూ లేరేమో; ఎవరూ చూసేందుకుకూడా వచ్చేవారు కాదు. ఆమె అన్నం తినేదో తినేదికాదో ఎవరికీ తెలియదు. భర్తకు ఏది అవసరమైనప్పుడు అది చేసి తర్వాత నిశ్శబ్దంగా కూర్చుని వుండేది. ఆమె మొహంలో ఎప్పుడూ దిగులూ విచారమూ వేదనా కనిపించేవి. ఒకనాటిరాత్రి నాకు చాలాసేపు నిద్ర పట్టక చివరకు అర్ధరాత్రివేళ నిద్ర పట్టింది. ఏదో సందడి వినిపించి ఉలికిపడిలేచాను. ఇంకేముంది? కట్టెను 'స్ట్రెచర్' మీద పడుకోబెట్టి బయటికి తీసుకుపోతున్నారు. ఆమె ఏడుస్తూ గుమ్మం దాటిపోయింది. తర్వాత నే నా రాత్రిఅంతా మేలుకునే వున్నాను. నిద్రపోదామని ఎంత ప్రయత్నించినా కళ్లు మూతలు పడలేరు. మర్నాడు యీ మంచంమీద పరుపు గలీబు తీసివేసి చలువగలీబు వేశారు. దిండు గలీబులు కూడా మార్చారు." అన్నాడు.

గుమ్మందగ్గర బూట్లచప్పుడయింది. డాక్టరు, ఒక నర్సు వెంటరాగా రోగులను చూసేందుకు వచ్చాడు. ఆయన మందు తెప్పించి సత్యనారాయణచేత త్రాగించాడు. తర్వాత అవలివ్యక్తిని పరీక్షచేసి గోడకు తగిలించివున్న 'చార్టు' చూశాడు. సంతృప్తిగా తల పంకించి గుమ్మంవైపుకు నడిచాడు.

సత్యనారాయణ నిశ్శబ్దంగా కూర్చున్నాడు. అతని మనస్సు వికలమయింది. అతడు కిటికీలోనుంచి చూస్తుండలా గంగరావిచెట్టుమీదవున్న ఏదో పక్షి గూట్లోనుంచి రెక్కలురాని పక్షిపిల్ల క్రింద పడిపోయింది. పెద్దపక్షి ఏమీ చెయ్యలేక 'కీచుకీచు'మని ఏడుస్తున్నది.

ఆవ్యక్తి మళ్ళీ ప్రారంభించాడు. "తర్వాత మూడు నాలుగు రోజులకే మరొకాయన వచ్చాడు. ఆయన ఏదో గవర్నమెంటుఉద్యోగంలో ఉండి జబ్బుచేస్తే శెలవుపెట్టి అస్పత్రిలో చేరాడు. అతను విపరీతంగా దగ్గేవాడు. అతని కళ్ళు తెల్లగా గాజుబిళ్ళలవలె వుండేవి. కళ్లెలో అప్పుడప్పుడు నెత్తురు పడుతూవుండేది. దగ్గువచ్చినప్పుడు బాధకు తట్టుకోలేక మెలికలు తిరిగిపొయ్యేవాడు. నిద్ర పట్టేదికాదు. ఊపిరాడక కాళ్ళూ చేతులూ కొట్టుకునేవాడు. అతనికి పెళ్ళి కాలేదు. కావలసినవారెవరూ లేరు. చిన్నప్పటినుంచి వారాలు చేసుకుని చదివి పైకివచ్చాడు. అతనీ మంచంమీద సరిగా పదిరోజులే వున్నాడు. ఒకరోజున బయట ఎండ విపరీతంగా వుంది. వేడిగాలి 'రివ్వు'న వీస్తున్నది. మధ్యాహ్నం రెండుగంటలయివుంటుంది. అతడు అప్పటిదాకా దగ్గి కొద్దిగా తగ్గిందికాబోలు ప్రశాంతంగా పైకిచూస్తూ పడుకుని వున్నాడు. నేను లేచి కిటికీ తలుపుమూసి ఆ తలుపుకూడా వేసేద్దామని అతని మంచంపక్కకు వెళ్ళాను. అతను ఎండినపుల్లలావున్న చేతిని నావైపు చాచి వారిస్తూ 'వేస్తే ఎలాపోనూ?' అని అడిగాడు. నావళ్లు జల్లుమన్నది. అతను తెలివిగావుండి మాట్లాడుతున్నాడో తెలివితప్పి మాట్లాడుతున్నాడో అర్థంకాలేదు. అతని మొహం ఎందుకో కొద్దిగా రంగు మారింది. అలాగే నిలబడివున్న నన్నుచూసి మళ్లీ నెమ్మదిగా 'ఆ ఎత్తయిన ప్రహరీవెనక ఏంవుంది?' అని అడిగాడు. నేను కొద్దిగా చలించి 'పెద్ద తాటితోపు వుంది.' అని సమాధానం చెప్పాను. అతను మళ్లీ 'దానివెనక?' అని అడిగాడు. నిజానికి ఆ తాటితోపు అవతల బ్రహ్మజెముడు పొదలూ పిచ్చిచెట్లూ తప్ప ఏమీలేవు. అందువల్ల 'ఏమీ లేదు.' అని జవాబు చెప్పాను. అతను కొద్దిగా ఆయాసపడుతూ 'ఏమీ లేదూ?' అని గొణుక్కుంటూ అటువైపు తిరిగి పడుకున్నాడు. అప్పుడతనికళ్లు ఎందుకో చెమర్చడం కనిపెట్టాను. నేను నెమ్మదిగా నా మంచందగ్గరికి వచ్చి కూర్చుని కళ్ళు మూసుకున్నాను. ఒక్కసారి గదిలోకి వేడిగాలి రివ్వున వీచింది. గదిఅంతా ఎవరో కనుపించని వ్యక్తులతో నిండిపోయినట్టనిపించింది. మరుక్షణంలో కళ్ళు తెరిచి చూశాను. నర్సుగాని డాక్టరుగాని ఎవరూ వచ్చినట్టులేదు. నే నాయనను పేరుపెట్టి పిలిచాను. అయనపేరు చిరంజీవి. ఆయన బదులు పలకలేదు. కదలనైనాలేదు. నా కనుమానం వేసింది. నేను

యుద్ధంలో ఎంతోమంది ప్రాణాలు విడుస్తూవుండగా చూశాను. నాతో సన్నిహితంగా మెలిగిన వారెంతోమంది గుండుదెబ్బతిని మెలికలు తిరిగిపోతూ వుంటే వారిపక్కన కూర్చుని సపర్య చేశాను. కాని నాకు ఎందుకో ఆయనను తాకేందుకు భయం పుట్టింది. త్వరత్వరగా ఎవరో తరుముకుని వచ్చినట్లు వరండాలోకివెళ్ళి వాళ్ళనూ వీళ్ళనూ కేకలు పెట్టాను. డాక్టరూ, నర్సులూ పరిగెత్తుకుంటూవచ్చారు. డాక్టరు గోడవైపు తిరిగి పడుకునివున్న అతన్ని యిటు తిప్పి పరీక్షించబోయి పెదవి విరిచి గదిలోనుంచి వెళ్ళిపోయాడు. అతన్ని తీసుకువెళ్లేదాకా నేను వరండాలోనే వున్నాను. తర్వాత గదిలో అడుగుపెట్టేందుకు కొద్దిగా భయం పుట్టింది. అయినా తప్పుతుందా! పిలుపు అందుకున్న వాళ్ళు వెళ్ళిపోతారు. మనం యిక్కడే వుండిపోవాలి." అన్నాడు.

సత్యనారాయణకు కడుపులో దేవినట్టయింది. అతనికణతలమీద నరాలు పొంగినవి. ఒకసారి తను పడుకునివున్న పక్కవైపు చూశాడు. మళ్ళీ భయపడి కళ్లు మూసుకున్నాడు.

సూర్యాస్తమయం అయింది. లోకంమీద ఎవరో నల్లని దుప్పటి నొకదాన్ని కప్పినట్టు చీకటి చిక్కగా అలుముకున్నది. ఒక నర్సు వచ్చి కాస్సేపు వాళ్ళిద్దర్నీ కనిపెట్టుకునివుండి మళ్ళీ ఎటో పోయింది. సత్యనారాయణ ఆలోచిస్తున్నాడు. తనఊరిలో ఆచార్యులు తనతో 'ఆ మందులవల్ల ఏమీ లాభంలేదు సత్యం! దూరపుకొండలు నునుపు. నేను మందిస్తానంటే నీకు గురిలేదు. మందు సరిగా వాడవు. లేకపోతే యీపాటికి నీకు కడుపునొప్పి లేశమైనా వుండేది కాదు. ఎందుకు వృథా ప్రయాస? ఇంటిపట్టున వుండి నేనిచ్చే మందు శ్రద్ధగా ఉపయోగించు' అని చెప్పాడు. ఆయన హస్తవాసి మంచిదని చుట్టుపక్కల వూళ్ళ జనం చాలామంది అనుకుంటూనే వుంటారు. తనకూ ఆయన వైద్యంమీద గురి ఉంది. కాని మందు సరిగా ఉపయోగించటం పడలేదు. పైగా యింట్లో భార్య పోరు - 'పట్నానికి వెళ్ళి పెద్ద వైద్యం చేయించుకోమని రోజూ గొడవచేసేది.

అవతల మంచంమీదఉన్న వ్యక్తికి ఆ పిల్ల మళ్లీ క్యారియర్‌తో భోజనం తెచ్చింది. పిల్లవాడీపూట వెంట రాలేదు. సత్యనారాయణకు ఆ వ్యక్తి చెప్పిన విషయాలు మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం వస్తున్నాయి. వాటిని గురించి ఆలోచించకూడదనుకున్నా వీలుపడటం లేదు. అతను కళ్ళు మూస్తే సరి, సన్నగా తెల్లగా పాలిపోయి అస్థిపంజరాలవలెవున్న ఇద్దరు వ్యక్తులు దగ్గుతూ గుర్తుకు వస్తున్నారు. వారి కళ్ళు గుంటలుపడి గాజుబిళ్లలవలె వున్నాయి. సత్యనారాయణ కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. అతనికి ముళ్ళమీద పడుకున్నట్టుగావుంది.

ఆపిల్ల తండ్రితో "తమ్ముడివాళ జామచెట్టుమీదనుంచి పడ్డాడు. కాలిమీద కొద్దిగా దోక్కుపోయింది...బావ దగ్గరినుంచి ఉత్తరం వచ్చింది. అక్కయ్యకు ఆరో నెలట...నీకు వొంట్లో యెలా వుందో అని ఆదుర్దా పడుతున్నదిట..." అని చెబుతున్నది. సత్యనారాయణ గోడవైపు తిరిగి పడుకుని, ఏమీ వినకుండా నిద్ర పట్టించుకుందామని ప్రయత్నం చేశాడు. కాని ఆ మాటలు వినబడుతూనే వున్నాయి. వచ్చే నెలలో పదిరోజులు సెలవు లిస్తారట...అన్నయ్య ఇక్కడికి వచ్చి వుంటానని వ్రాశాడు. మనల నందర్నీ ఎప్పుడయినా వీలు చూసుకుని నాగార్జున సాగర్ తీసుకుపోయి అంతా చూపిస్తానని కూడా వ్రాశాడు...వొదినకు నాలుగు రోజులనుంచి జ్వరం తగులుతున్నదిట. మనల నందర్నీ చూడాలనుకుంటున్నదిట..."

సత్యనారాయణకు క్రమంగా తర్వాత మాటలు వినబడలేదు. అతనికి నిద్రపట్టింది. ఆ వ్యక్తి భోజనం చేసి చేతులు కడుక్కుని తుడుచుకుంటూ "ఏమండీ" అని పిలిచి ఏమీ సమాధానం రాకపోయేసరికి "నిద్ర పట్టినట్టుంది." అనుకున్నాడు.

ఆపిల్ల క్యారియర్ కడిగి చేతిలో వుంచుకుని "నే నింటికిపోతున్నాను" అని చెప్పి వెళ్లిపోయింది. ఆవ్యక్తి మంచంమీద కూర్చునివున్నాడు. అంతటా నిశ్శబ్దంగావుంది. వరండాలో ఒకరిద్దరు అటూ యిటూ నడుస్తున్న సవ్వడి వినిపిస్తున్నది. కిటికీలోనుంచి చల్లని గాలి వీస్తున్నది. వర్షంవచ్చేట్టుగావుంది. గంగరావి చెట్టు చీకటిలో జడలు విప్పుకుని నిలబడివున్న రాక్షసి వుంది. రాత్రిపూట విహరించే ఏదోపిట్ట విచిత్రంగా కూస్తూ ఎరిగిపోతున్నది. ఆవ్యక్తికి నిద్రపట్టలేదు కాబోలు కళ్లుమూసుకుని అలా కూర్చునేవున్నాడు.

ఒక గంట గడిచివుంటుంది. హఠాత్తుగా గుండె లవిసిపోయే కేక వినిపించింది. ఆవ్యక్తి అదిరిపడి కళ్లు తెరిచి చూశాడు. సత్యనారాయణ మంచంమీదినుంచి క్రిందపడి పెద్దగా కేకలు పెడుతున్నాడు. నర్సు గదిలోకి

పరిగెత్తుకుని వచ్చింది. వేగంగా వస్తున్న గాలికి కిటికీ తలుపు అటూయిటూ కొట్టుకుంటున్నది.

ఇద్దరూ అతన్ని రెండువైపులా పట్టుకున్నారు. సత్యనారాయణ నిలువునా వొణికిపోతూ "ఆ మంచం మీద ముగ్గురెట్లా పడుకుంటారు?నన్ను వాళ్లిద్దరూ నెట్టి పారేశారు. నేను కిందనే పడుకుంటాను." అని అరుస్తున్నాడు. నర్సు ఏదో బెల్లు మోగించింది. సత్యనారాయణ "అసలు నేనిక్కడ వుండను. వాళ్లు ఉండనివ్వరు. నన్ను పోనివ్వండి, వదిలిపెట్టండి." అని విదిలించుకోవటం ప్రారంభించాడు. ఆ వ్యక్తి బలమైన చేతులతో అతన్ని అదిమిపట్టుకుని "ఏమిటండీ! ఏదైనా కల వచ్చిందా?." అని అడుగుతున్నాడు. సత్యనారాయణ ఆయన్ను అవతలికి నెట్టివేసి మంచంవైపుచూసి కెవ్వుమని అరిచి కళ్లుమూసుకున్నాడు.

డాక్టరు "ఏమిటీ గొడవ?" అంటూ లోపలికి వచ్చాడు. సత్యనారాయణకు ఒళ్లుతెలిసింది. అతని కళ్లలో నీళ్లు నిండినవి. కొద్దిగా వొణుకున్నాడు. డాక్టరును చూసి "నాకు భయంగావుంది. నేనిక్కడ వుండలేను. మావూరు వెళ్లిపోతాను." అన్నాడు. డాక్టరు నెమ్మదిగా"ఫరవాలేదు నేనున్నానుకదూ!ఏం జరిగిందో చెప్పు." అని అడిగాడు.

సత్యనారాయణ కొద్దిగా తేరుకుని "నాకు నిద్ర బట్టింది. కాని అన్నీ పీడకలలే. సన్నగా పాలిపోయి వున్న యిద్దరు నన్నుచూసి నవ్వి 'మాతోచేరావా?' అని అడిగారు. తర్వాత ముగ్గురం ఏదోకొంప ఎక్కటం ప్రారంభించాము. పైకివెళ్లినతర్వాత వాళ్లిద్దరూ వొక్కటై నన్ను క్రిందికితోసినట్టు మొదట కలవచ్చింది. తర్వాత మళ్లీ కాస్సేపు మామూలునిద్ర. మళ్లీ కల వచ్చింది. వాళ్లిద్దరూ చెట్టాపట్టాలు వేసుకుని గాలికి వూగిపోతూ యీ గదిలోకి వచ్చారు. ఈ మంచంమీద చెరొకవైపూ పడుకున్నారు. కాస్సేపాగి 'ఈ మంచం మీద ముగ్గురం పడుకునేందుకు వీల్లేదు. నువ్వు దిగు' అన్నారు. నేను మొండికెత్తి వారిమాట వినలేదని యిద్దరూ కలిసి నన్ను క్రిందికి తోసిపారేశారు." అని చెప్పాడు. అతని చేతులూకాళ్లూ కొద్దిగా వొణుకుతున్నాయి.

డాక్టగు చిరునవ్వు నవ్వాడు. "అయితే నాతోరా" అంటూ ఆయన సత్యనారాయణను తనగదిలోకి తీసుకువెళ్లి "ఇంతకీ ఏంచెయ్యమంటావు? ఇంకెక్కడా పడకలు ఖాళీలేవు." అన్నాడు. సత్యనారాయణ సంతోషంతో "అదీ మంచిదే. ఇప్పుడు మావూరికి బండి వుంది. నన్ను వెళ్లనివ్వండి. ఇక్కడ మరి కాస్సేపు వుంటే నా గుండె పగిలిపోతుంది. మానాన్న చచ్చిపోయినప్పుడు 'నేనసలే పిరికివాణ్ణ'ని మాపెద్దన్నగారు నన్ను ఆయనశవందగ్గరికి కూడా వెళ్లనివ్వలేదు. నేనలాగే పెరిగాను. మీకు పుణ్యం వుంటుంది. నన్ను వెళ్లనివ్వండి." అన్నాడు.

డాక్టరు కాస్సేపు ఆలోచించాడు. తర్వాత తల పంకిస్తూ "ఊ! సరే కానియ్!" అంటూ, కాయితం మీద ఏదో వ్రాసి "ఈమందు కొనుక్కుని ఉపయోగించు. కడుపునొప్పి తగ్గిపోతుంది. లేకపోతే మళ్లీ ఒకసారి నాదగ్గిరికి రా. నీకిక్కడికి రావటానికి భయమైతే మా యింటికి రా. మరో మందు వ్రాసి యిస్తాను." అన్నాడు.

సత్యనారాయణ వినయంగా ఆ చీటీ అందుకుని ఆర్ద్రనయనాలతో "మీఋణం తీర్చుకోలేను. వస్తానండి." అంటూ వరండాలోకి వచ్చాడు. అతనివంకనే చూస్తూ డాక్టరు తనలో తను నవ్వుకున్నాడు.

బయటవాతావరణం ఆహ్లాదకరంగా వుంది. చల్లగాలి మెల్లగా వీస్తున్నది. మొదటిఆట సినిమా వదిలిపెట్టారు కాబోలు. జనం చెదురు చెదురుగా నడుస్తున్నారు. సత్యనారాయణ చేతిలో సంచితో త్వర త్వరగా తీవిగా స్టేషనువైపు నడిచాడు,